క్లుప్తంగా

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలు, ఆలయ ప్రతినిధులు

అల్లిపురం : కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం జన్మదినం సందర్భంగా ఆయన తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి వారం ఒక దాత సహకారంతో ఈ అన్నదానం చేపడుతున్నట్లు కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పంపాన గణేష్, జాయింట్ సెక్రటరీ బడే నాగరాజు, సహ కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీ విద్యాసురేష్‌కు బంగారు పతకం



డాక్టర్ శ్రీవిద్యా సురేష్‌కు బంగారు పతకం అందజేస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన పరీక్షల్లో (పీజీ డెర్మటాలజీ, వెనిరాలజీ, లెప్రసీ (డీవీఎల్) అత్యధిక మార్కులు సాధించిన డాక్టర్ శ్రీవిద్యా సురేష్‌కు బంగారు పతకం లభించింది. ఈ పతకాన్ని గురువారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అందజేశారు. కేజీహెచ్ డీవీఎల్ విభాగాధిపతి డాక్టర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.అశోక్‌కుమార్, ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ హెచ్‌వోడీలు జి.రఘు రామారావు, టి.నారాయణరావు, ఆర్ఎంవోలు కేవీ అరుణాదేవి, జగదీష్‌కుమార్, సి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిని సీతారామ్ శత జయంతి

సీతంపేట: విశాఖ సిటీ శిష్టకరణ సంఘం వ్యవస్థాపకుడు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సాహిని సీతారామ్ శత జయంతి వేడుకలు అబిద్‌నగర్‌లోని సౌభాగ్య సదన్‌లో గురువారం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది సాహిని రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీతారామ్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సీతారామ్ కుమారుడు సాహిని సత్యానంద్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, సీతారామ్ కుటుంబ సభ్యులు ఎస్.శ్రీనివాస్, ఎస్.రామదయాల్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం

ఏయూక్యాంపస్: జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు గాయత్రి విద్యా పరిషత్ వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్‌లోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి సీనియర్ వైద్యులు పద్మినీదేవి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి పౌష్టికాహారం అవసరమన్నారు. ఆధునిక ఆహార అలవాట్లకు స్వస్తి చెప్పి సహజ ఉత్పత్తులు, రసాయనాలు లేని ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పలు నమూనాలను విద్యార్థులు తయారు చేయగా, ఆమె వీటిని పరిశీలించి ఉత్తమ నమూనాలకు బహుమతులు అందజేశారు. పాఠశాల స్థాయి నుంచి మంచి ఆహార అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవాల్సిన అవసరాన్ని పలు ఉదాహరణలో వివరించారు. శరీరంలో పౌష్టికాహార లోపం ఫలితంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, వారి పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల డాక్టర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కళకళ.. తళతళ

ప్రజల మౌలిక అవసరాలు తీర్చటమే ప్రభుత్వాలు చేయాల్సిన పని. అయితే గత ప్రభుత్వాలు ఈ విషయంలో ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఈ కారణంగానే వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాలు ఇప్పటికీ శిథిలావస్థలోనే మనకు కనిపిస్తాయి. రోడ్లు, డ్రైనేజీలు, యూజీడీలు, కాలువల వంటివన్నీ ఇదే స్థితిలో దర్శనమిస్తాయి. ఈ సమస్యలపై అప్పట్లో ప్రజలు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పరిష్కారానికి నోచుకోలేదు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక చేసిన అభివృద్ధితో పాతనగరం కొత్తందాలు సంతరించుకుంటోంది. ముఖ్యంగా 35వ వార్డులోని శిథిల రహదారులు ఇప్పుడు కళకళలాడుతున్నాయి. తమ బాగోగులు పట్టించుకునే సీఎం వచ్చినందుకు స్థానికులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు.



దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో కొత్తగా నిర్మించిన రహదారి

- 35వ వార్డులో మెరిసిపోతున్న నూతన రహదారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, వాహన చోదకులు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ ఇటీవల వేసిన రహదారులు కళకళలాడుతున్నాయి. గత టీడీపీ పాలనలో ఈ ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి జరగకపోవడంతో వార్డులో రహదారులు, కాలువలు, కల్వర్టులు ఇలా అన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి వార్డులో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. పూర్ణామార్కెట్ జంక్షన్, వన్ వే రహదారి, బౌడారారోడ్డు, బ్యారెక్స్, వెలంపేట, ఆర్‌ఆర్‌ఎంఆర్ రోడ్డు, మున్సిపల్ స్టేడియం ఎదురుగా అన్ని బీటీ రహదారులు కొత్తగా నిర్మించటంతో ఈ ప్రాంతంలోని రహదారులన్నీ రాకపోకలకు అనువుగా, చక్కగా తయారయ్యాయి.



నూతనంగా నిర్మించిన ఆర్‌ఆర్‌ఎంఆర్ రోడ్డు

ప్రధాన మార్కెట్ కావడంతో..

పూర్ణామార్కెట్ నగరంలో ప్రధాన మార్కెట్ కావటంతో ఇక్కడ వ్యాపారులు, వినియోగదారుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అలాంటి ఇక్కడి రోడ్లు శిథిలం కావటంతో వ్యాపారులు, కొనుగోలుదారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ దశలో నూతనంగా రహదారులు నిర్మించటంతో రాకపోకలకు మార్గం సుగమం అయింది.

మరింత అభివృద్ధి చేస్తాం..



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతుల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఇప్పటికే వార్డులో ప్రధానమైన రహదారులతో పాటు యూజీడీ పనులు చేశాం. కాలువలు నిర్మించి, వీధిలైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం.

– విల్లూరి భాస్కరరావు, 35వ వార్డు కార్పొరేటర్

ఓటరు నమోదు అమలు తీరు పరిశీలన



ఓటరు నమోదు కార్యక్రమ వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న జేసీ విశ్వనాథన్

అల్లిపురం : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం అమలు కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. గురువారం ఉదయం వేంకటేశ్వరమెట్ట–1 సచివాలయ పరిధిలో నిర్వహించిన ఓటరు సర్వే కార్యక్రమ నిర్వహణను దగ్గరుండి పరిశీలించారు. ఓటర్ల నమోదుకు సంబంధించి బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఓటర్ల చేరికలు, తొలగింపులు, ఒకే డోరు నంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఫామ్–6 ద్వారా నూతన ఓటర్ల నమోదు, ఫామ్ 6 (బి), ఫామ్–7, ఫామ్–8 ద్వారా ఓటర్ల జాబితా వివరాలలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలని ఆయన వివరించారు. పొరపాట్లకు తావీయకుండా పారదర్శకంగా అర్హులందరి ఓట్లు నమోదయ్యేలా జాగ్రత్త వహించాలన్నారు. నిబంధనల ప్రకారం ఓటర్ల మార్పులు, చేర్పులు చేపట్టి తుది జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో స్టూడెంట్ కౌన్సిల్ ఉత్సవాలు



సాంస్కృతిక ప్రదర్శనల్లో అలరించిన విద్యార్థినుల నృత్యం

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో 66వ స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభోత్సవ వేడుకలు గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. కొత్త విద్యా సంవత్సరంలో చేరిన ఇంటర్, డిగ్రీ ఫస్టియర్ విద్యార్థినులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ డే వేడుకలు జరిపారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వైవీ అనురాధ పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారత పొందినట్లు అన్నారు. కళాశాలతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ రాధాకృష్ణను సత్కరించారు. ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. మిస్ ఫ్రెషర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డిగ్రీ విభాగంలో సాయి, పావని, మానస, ఇంటర్ విభాగంలో ఈశా, సూర్యవినయ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ, జయలక్ష్మి, మేరీ విజయరత్న, అధ్యాపకులు, కౌన్సిల్ సలహాదారులు పాల్గొన్నారు.

వ్యాయామం, యోగా, ధ్యానంతో ఆరోగ్యం



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఆరోగ్యకరమైన అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటితో ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండవచ్చని డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. రైల్వే ఉద్యోగులు, సిబ్బంది కోసం వాల్తేర్ డివిజన్ ప్రేరణ పేరుతో గురువారం దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే మానసిక ప్రశాంతత, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని ఉద్యోగులకు సూచించారు. హెల్త్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్ టెక్నిక్స్‌ను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రేరణాత్మకమైన కేస్‌స్టడీల ద్వారా పలు విషయాలు వెల్లడించారు. అనంతరం రైల్వే ఉద్యోగులు అడిగిన ప్రశ్నలకు సూర్యారావు సమాధానమిచ్చారు. ఈ సమావేశాల ద్వారా సిబ్బందిలో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం కలిగిస్తూ, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ఇటువంటి సెమినార్‌లకు ప్రజలను ప్రభావితం చేసిన, చేస్తున్న పలువురు ప్రత్యేక వ్యక్తులను తీసుకొచ్చి వారి అనుభవాలు, ఆలోచనలు, సూచనలు, సలహాలు ఉద్యోగులకు తెలిసేలా చేస్తూ వారిలో నూతనోత్సాహాన్ని నింపుతున్నట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ కూటికుప్పలను డీఆర్‌ఎం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), వివిధ విభాగాలకు చెందిన బ్రాంచి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలంగా ఉట్ల సంబరం



ఉట్ల సంబరాన్ని ప్రారంభిస్తున్న నారాయణరావు, సుధాకర్

విశాఖ విద్య : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని గురువారం 29వ వార్డు రామజోగిపేట ఏరియాలో ఆర్‌జేపీ బాయ్స్ ఆధ్వర్యంలో ఉట్ల సంబరం కోలాహలంగా జరిగింది. వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు వురికిటి నారాయణరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సీతంరాజు సుధాకర్ వేడుకలో పాల్గొన్నారు. కాలనీ యువత, చిన్నారులు ఉత్సాహంతో ఉరకలు వేశారు. కార్యక్రమంలో కండిపల్లి సతీష్‌కుమార్, ఒమ్మి కిషోర్, మున్నా, నవీన్, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే అమ్మవారి త్రికాల పంచామృతాభిషేకం సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రావణమాసం ప్రత్యేక కుంకుమ పూజలు..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మీ పూజలు గురువారం 22వ రోజుకి చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత శ్రావణలక్ష్మి పూజలు..

ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం నిర్వహించనున్నారు. ఉదయం 6.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు కలశం కోసం చెంబు, ఆచమనం కోసం గ్లాసు తెచ్చుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు.

అభివృద్ధికి.. అభ్యర్థన



లక్ష్మీ టాకీస్ వద్ద కళావిహీనంగా ఉన్న పార్కు



నిర్వహణ లేక పార్కింగ్ స్థలిగా మారిన క్వీన్ విక్టోరియా స్టాట్యూ ఏరియా

- పాతనగరంలో సదుపాయాలు కల్పించాలని స్థానికుల వేడుకోలు
- పార్కుల్లో సౌకర్యాల కోసం వినతి
- పాతబస్టాండ్ స్థానంలో నూతన బస్‌బే ఏర్పాటుకు విజ్ఞప్తి

జగదాంబ : నియోజకవర్గంలోని పాతనగరాన్ని అభివృద్ధి చేయాలని 39వ వార్డు ప్రజలు అభ్యర్థిస్తున్నారు. నగరంలో ముఖ్య ప్రాంతమైన పాతనగరం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది పురాతన ప్రాంతమే అయినా పోర్టుకు వచ్చే పర్యాటకులు, విశాఖ మదీన బాబా దర్గా, సోయగాల పోర్టు, సముద్ర అందాలు, షిప్‌యార్డు, కొండ గుడి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఇక్కడ ఆకట్టుకునే ఎన్నో అందమైన ప్రాంతాలు ఉన్నా ఎందుకో పాతనగరం వెనుకబడే ఉండిపోయింది. బ్రిటిష్ కాలం నాటి రాణి విక్టోరియా విగ్రహం, మున్సిపల్ స్టేడియం, క్వీన్‌మేరీ పాఠశాల, బ్రిటిష్ కట్టడాలు ఇక్కడ ఉన్నాయి. వీటిని సంరక్షిస్తే ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుంది. అయితే ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని పాతనగరవాసులు చెబుతున్నారు.

కళావిహీనంగా పార్కులు..

పాతనగరంలోని లక్ష్మీ టాకీస్ వద్ద పెద్ద పార్కు ఉంది. కానీ అందులో కనీసం ఒక్క మొక్క గాని, కూర్చోవడానికి కనీసం కుర్చీలు, ఆహ్లాదం పంచే వాతావరణం మచ్చుకైనా లేవని స్థానికులు వాపోతున్నారు. నగరంలో అన్ని వార్డుల్లో ఎక్కడో ఒక దగ్గర పార్కులు ఏర్పాటు చేసి అన్ని సదుపాయలు కల్పిస్తుంటే ఇక్కడ ఇప్పటికే పార్కు ఉండి కూడా సదుపాయాలకు నోచుకోలేదని అంటున్నారు. నగరంలో పలుచోట్ల నూతన బస్సు బేలు నిర్మిస్తున్నా నగరానికే మొట్టమొదటి బస్టాప్ ఇంకా పాత పద్ధతిలోనే ఇక్కడ దర్శనమిస్తుందంటున్నారు.

మరింత అభివృద్ధికి చర్యలు



గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పాతనగరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధికి నోచుకుంటోంది. రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణం, వీధిలైట్లు, కాలువలు, తాగునీటి సౌకర్యం వంటివి ప్రాధాన్యతాక్రమంలో ఏర్పాటు చేస్తున్నాం. షాదీఖానా, కల్యాణ మండపాల నిర్మాణం, ప్రధానంగా ఎస్ఎల్ కెనాల్ నుంచి నీటి ప్రవాహం వెనక్కి రాకుండా చర్యలు తీసుకున్నాం. పార్కులు కూడా అభివృద్ధి చేస్తాం. మరింత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

– మహ్మద్ సాదిక్, 39వ వార్డు కార్పొరేటర్

సింహగిరీశుడికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

సింహాచలం: సింహగిరీశుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన నేత్రపర్వంగా జరిపించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడామండపంలోని వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం కనులపండువగా జరిపించారు. ఆలయ కల్యాణమండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపజేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వేడుకగా వృక్షాబంధన్



కేజీహెచ్‌లో చెట్టుకు రాఖీ కడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్



చెట్టుకు రాఖీ కడుతున్న డీఎఫ్‌వో డాక్టర్ అనంత్ శంకర్

మహారాణిపేట : నేచర్ క్లబ్ (అఫీషియల్ కాలనీ) ఆధ్వర్యంలో గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో వృక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని చెట్లకు రాఖీలు కట్టారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలో జిల్లా అటవీ శాఖాధికారి అనంత్ శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే కేజీహెచ్ ఆవరణలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ చెట్లకు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ ఏడీ శ్రీనివాసకుమార్, ఆర్ఎంవో కేవీ అరుణాదేవి, నేచర్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా జీవిద్దాం



శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు

సీతంపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని ఎకో ఇండియా అధినేత దీపా ఝా పిలుపునిచ్చారు. ఎకో ఇండియా, నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పర్యావరణంపై రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆర్‌జేడీ జ్యోతికుమారి, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ హితంగా ఎలా జీవించాలన్న విషయాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలన్నారు. దాని కోసం పాఠశాలలో నిర్వహించవలసిన కార్యక్రమాలు, వాటిని అమలు చేయవలసిన విధానాల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. ఈ సందర్భంగా పలు రకాల సేంద్రియ ఉత్పత్తులు, ఔషధ మొక్కలను, పర్యావరణ సంరక్షణ మీద మన్యం జిల్లా కో ఆర్డినేటర్ జి.రాజు గీసిన వివిధ పెయింటింగ్స్‌ను ప్రదర్శించారు. ఏపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ పి.నీలకంఠ, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకులు జె.వి.రత్నం, విశాఖ జిల్లా ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ ఎస్.బాబూరావు, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి ఏయూ ముస్తాబు

- 9న స్నాతకోత్సవం
- హాజరు కానున్న రాష్ట్ర గవర్నర్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం 87,88,89,90 సంయుక్త స్నాతకోత్సవం ఈ నెల 9వ తేదీన జరగనుంది. దాదాపు నాలుగేళ్ల తరువాత జరగనున్న ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చాన్సలర్ హోదాలో హాజరవుతున్నారు. స్నాతకోత్సవం నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. స్నాతకోత్సవంలో సుమారు 690 మంది డాక్టరేట్లు అందుకోనున్నారు. వీరితో పాటు బంగారు పతకాలు, ప్రైజ్‌లు సాధించిన వారు 600 మంది వరకు ఉన్నారు. దీనితో వేదికపై పట్టాలు, ప్రైజ్‌లు, మెడల్స్ తీసుకునే వారు 1,290 మందికి పైగా ఉంటారు. వీరితో పాటు వారి కుటుంబ సభ్యులు సైతం అదే సంఖ్యలో కార్యక్రమానికి హాజరవుతారు. అతిథులు, ఆహ్వానితులు కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం జరిగే స్నాతకోత్సవ మందిరాన్ని సరికొత్తగా తీర్చిదిద్దుతున్నారు. సభా వేదికతో పాటు గవర్నర్ కోసం ప్రత్యేకంగా ఒక గ్రీన్ రూంను సిద్ధం చేస్తున్నారు. గవర్నర్‌తో పాటు ఇతర అధికారులు ధరించే ప్రత్యేకమైన స్నాతకోత్సవ వస్త్రాలు ఇప్పటికే సిద్ధం చేశారు. వేదికపై రాష్ట్ర గవర్నర్, ఉపకులపతి, ముఖ్య అతిథి, గౌరవ డాక్టరేట్‌లు అందుకునే వారు ఆశీనులు కావడానికి ప్రత్యేకమైన కుర్చీలను సైతం సిద్ధం చేశారు. సభావేదిక, ప్రాంగణంలో భారీ శీతలీకరణ యంత్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.

2500 మంది వీక్షణ

స్నాతకోత్సవ మందిరంలో జరిగే కార్యక్రమానికి దాదాపు 2500 మంది వరకు ప్రత్యక్షంగా వీక్షిస్తారు. దీనికి అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ అభ్యర్థికి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కేటాయించి, ముందుగానే వారికి తెలియజేస్తారు. అదే విధంగా డాక్టరేట్ తీసుకునే వారితో పాటు ఒకరిని అనుమతిస్తారు. వారికి వేరుగా సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నానికి పూర్తిస్థాయిలో వేదికను సిద్ధం చేసే దిశగా సిబ్బంది పనిచేస్తున్నారు. సాయంత్రం స్నాతకోత్సవం మందిరాన్ని ఏయూ ఉన్నతాధికారులు సందర్శించి, పనులను పరిశీలిస్తారు. స్నాతకోత్సవ మందిరం చుట్టూ సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే చుట్టూ ఉన్న రహదారులను మరమ్మతులు చేయడం, కొత్తవాటిని నిర్మించడం పూర్తి చేశారు. స్నాతకోత్సవ మందిరం వెనుక భాగంలో ఉన్న పిచ్చి మొక్కల తొలగించి, చెట్లకు ప్రూనింగ్ పనులు పూర్తిచేశారు. ఎప్పటి ప్పుడు వ్యర్థాలను తొలగించి, తరలిస్తున్నారు.



సిద్ధమవుతున్న వేదిక